



రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న వి.రాంభూపాల్

రాజకీయ సందిగ్ధంలో.... శింగనమల



◆ వైసిపి, టిడిపి రెండింటిలోనూ గందరగోళం
◆ ఖరారవని అభ్యర్థులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులెవరన్న సందిగ్ధత ఇంకా కొనసాగుతోంది. అటు అధికార వైసిపిలోనూ...ఇటు ప్రతిపక్ష టిడిపి రెండింటిలోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన ఈ ప్రాంతంలో రెండు పార్టీల నుంచి ఈసారి మార్పులుంటాయని ప్రచారమూ నడుస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేగా వైసిపి నుంచి జొన్నలగడ్డ పద్మావతి ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆమెకు ఈసారి అవకాశం లేదని అధిష్టానం ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. జొన్నలగడ్డ పద్మావతి భర్త అలూరు సాంబశివారెడ్డి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుల్లో ఒకరుగా చెప్పుకుంటూ ఉంటారు. సర్వేల్లో తగినంత సానుకూలత లేనందున మార్పు చేయాలని అధిష్టానం నిర్ణయించింది. గత వారంలో ఎమ్మెల్యే దంపతులు అక్కడే ఉండి టికెట్టు కోసం వారి ప్రయత్నాలు చేసుకున్నప్పటికీ ఆశించిన ఫలితం దక్కలేదు. ఈ క్రమంలోనే జొన్నలగడ్డ పద్మావతి సోషియల్ మీడియాలో సాగునీటి సమస్యపై మాట్లాడటం, అందులో వైసిపి ప్రజాప్రతినిధుల గురించి ప్రస్తావించడం పెద్ద దుమారమే రేపింది. విజయవాడలో ఈ అంశంపై మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ వివరణిచ్చుకునే పరిస్థితి నెలకొంది. అనంతరం జొన్నలగడ్డ పద్మావతి దంపతులు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని కలసిన ఫోటోలు మీడియాకు అందజేశారు. పార్టీ కోసం పనిచేస్తామన్న ప్రకటన కూడా చేశారు. ఈ క్రమంలో కొత్త అభ్యర్థిని సూచించే బాధ్యత కూడా వీరిపైనే ఉంచినట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో వైసిపి సర్వే బృందాలు ఎవరైతే బాగుంటుందని ఆరా తీసే పనిలో ఉన్నాయి. ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు పెద్దఎత్తున ప్రచారం నడుస్తున్నప్పటికీ ఎంపికపై కసరత్తు పూర్తవలేదు. మూడో జాబితా విడుదల సమయానికి అయినా ఈ నియోజకవర్గంపై వైసిపిలో స్పష్టత వస్తుందా లేక మరో జాబితా వరకు వేచి చూడాల్సి ఉంటుందా అన్నది చూడాల్సి ఉంది.

తెలుగుదేశం పార్టీలోనూ అయోమయమే..

ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలోనూ అయోమయమే కొనసాగుతోంది. 2019లో ఇక్కడ టిడిపి ఓటమి చెందింది. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన బండారు శ్రావణినే కొంతకాలం నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా నియమించారు. ఇక్కడి నేతలకు, ఈమెకు మధ్య పొగసకపోవడంతో విభేదాలు తారా స్థాయిలో చెలరేగాయి. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జీని కాదని టుమెన్ కమిటీ పేరుతో ఇద్దరు నాయకులను తెరపైకి తెచ్చారు. వారి ఆధ్వర్యంలో అప్పుడప్పుడు కొన్ని కార్యక్రమాలు నిర్వహించారు. ఆ ఇద్దరు నాయకులు కూడా ఓసి సామాజిక తరగతికి చెందిన వారు కావడం గమనార్హం. ఎస్సీ రిజర్వు నియోజకవర్గం కావడంతో ఎస్సీ సామాజిక తరగతి నుంచి ఇన్‌ఛార్జీని నియమించాల్సి ఉంది. ఇప్పటికీ దీనిపై టిడిపిలో స్పష్టత రాలేదు. గతంలో పోటీ చేసి ఓటమి చెందిన బండారు శ్రావణినే మళ్లీ నియమిస్తారా లేక కొత్త వారిని నియమిస్తారా అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. మరోవైపు మాజీ ఎపిసిసి అధ్యక్షులు సాకే శైలజనాథ్ టిడిపిలో చేరుతారన్న ప్రచారమూ ఉంది. చేరితే ఆయనకే టిక్కెట్టు ఇస్తారా లేదా అన్నది కూడా చూడాల్సి ఉంది.

అంగన్‌వాడీలకు అండగా ప్రత్యక్ష పోరాటాలు

◆ నేటి నుంచి కోటి సంతకాల సేకరణ
◆ రౌండ్‌టేబుల్ సమావేశం అఖిలపక్ష పార్టీల నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

న్యాయమైన డిమాండ్‌లతో అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి సమస్యలు పరిష్కరించాలని లేకుంటే అంగన్‌వాడీ కార్మికులకు అండగా ప్రత్యక్ష పోరాటాలు చేస్తామని అఖిలపక్ష పార్టీల నేతలు తెలిపారు. అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా శుక్రవారం నాడు అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో రాజకీయ పార్టీలు, ప్రజా, కార్మిక, విద్యార్థి సంఘాల నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, టిడిపి జిల్లా నాయకులు లక్ష్మి నరసింహులు, జెఎం.బాషా, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు దాదాగాంధీ, సిపిఐఎంఎల్ జిల్లా నాయకులు సి.చంద్రశేఖర్, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, జిల్లా కోశాధికారి జమున, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, రైతు సంఘం జిల్లా నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధు, ప్రజలందరి పార్టీ నాయకుడు వెంకటసుబ్బయ్య, ప్రజా గాయకుడు ఆదినారాయణ, నిరుద్యోగుల ఐక్య వేదిక నాయకులు టిపి.రామన్న తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ 32 రోజులుగా అంగన్‌వాడీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎస్మా ప్రయోగించడం, నోటీసులు ఇవ్వడం దుర్మార్గంగా ఉందన్నారు. నాలుగు దపాలుగా చర్చలు జరిపి వేతనం పెంపుదల గురించి మాట్లాడకపోవడం ప్రభుత్వ ద్వందనీతికి నిదర్శనం అన్నారు. వెంటనే ఎస్మా చట్టాన్ని రద్దు చేసి, అంగన్‌వాడీల న్యాయమైన అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటం చాలా గొప్పదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను బెదరగొట్టినట్లు అంగన్‌వాడీ కార్మికులను చేయాలని చూసిన ప్రభుత్వాన్ని అంగన్‌వాడీలు ధైర్యంగా ఎదర్కొంటారని తెలిపారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీలను ఇబ్బందులకు గురి చేసిన ఏ ప్రభుత్వం కూడా ఎన్నికల్లో గెలవలేకపోయిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కూడా ఇదే జరుగుతుందన్నారు. టిడిపి నాయకులు నరసింహులు మాట్లాడుతూ అంగన్‌వాడీల పోరాటానికి టిడిపి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అనంతరం రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అంగన్‌వాడీల వేతనాలు పెంపుదల చేశాకే సమ్మె విరమించాలని, అప్పటి వరకు ఐక్య పోరాటాలు చేయాలని, శనివారం నుంచి అంగన్‌వాడీలకు మద్దతుగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలనే తీర్మానాలు చేశారు.



డ్వామా కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వ్యకాసం నాయకులు

గ్రామాల్లో 'ఉపాధి' కల్పించండి

డ్వామా కార్యాలయం వద్ద వ్యకాసం ధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి గ్రామాల్లో వెంటనే పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.సూరి, ఎం.క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు అనంతపురం డ్వామా కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పేదలకు వరంలా నిలిచిందన్నారు. నాలుగు లక్షల మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి పూనుకుని కొత్త నిబంధనలు తీసుకొచ్చిందన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా నెలల తరబడి నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఆరు వారాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. తక్షనమే బకాయి బిల్లులు చెల్లించాలన్నారు. పనిముట్లు, సమ్మర్ అలవెన్స్‌లు, అదనపు వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలన్నారు. 100 రోజులు పూర్తైన వారికి అదనపు పనిదినాలు కల్పించాలన్నారు. 200 రోజులు పనులు కల్పించి రోజువారి కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు భాస్కర్, కృష్ణ, నారాయణ, రంగస్వామి, నాగప్ప, నాగ లింగయ్య, కరీం, పెద్దయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల



నారా లోకేష్‌కు బహుమతి అందజేస్తున్న శ్రావణిశ్రీ

మంగళగిరిలోని నారా లోకేష్ నివాసంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా లోకేష్ చేపట్టిన యువగనం పాదయాత్ర దిగ్విజయంగా ముగిసిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆమెతోపాటు తల్లి బండారు లీలావతి ఉన్నారు.

కృష్ణానాయక్‌కు 'గోర్ బంజారా రత్న' అవార్డు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



పురస్కారం అందుకుంటున్న కృష్ణానాయక్

బంజారాల కాశీ తీర్థ చేత్రం పొహారాదేవీ, (పార్యాగడ్)లో ధర్మ గురు తపస్వి సంత్ డాక్టర్ రామారావు మహరాజ్ వారి జాతీయ 'గోర్ బంజారా రత్న' విశిష్ట పురస్కారం 2024ను జిల్లాకు చెందిన కృష్ణానాయక్ అందుకున్నారు. ధర్మ గురు తపస్వి సంత్ డాక్టర్ రామారావు మహరాజ్ బంజారా సమాజ్ వికాస ఫెడరేషన్ భారత్ వారు బంజారాల పీఠం (సంత్ శ్రీ సేవా లాల్ మహరాజ్ వారి అంతిమ మజిలి) పోహరాగడ్‌లో గురువారం శ్రీ సంత్ బాబు సింగ్ మహరాజ్, శ్రీ జితేంద్ర మహరాజ్ వారి కర కమలాలతో విశిష్ట బంజారా రత్న పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లాలోని బెలుగుప్ప మండలం ఎలగలవంక తండాకు చెందిన నేనావత్ కృష్ణానాయక్ అవార్డును అందుకున్నారు. ఈయన సంఘసేవ, బంజారా సాహిత్యంపై అనేక సత్కారాలు పొందారు. ఇప్పటి వరకూ 18 పుస్తకాలు రాసి బంజారా సమాజాన్ని మేల్కొలిపారు. ఈ పురస్కారాన్ని తనకు జన్మ ఇచ్చిన తల్లిదండ్రులు తజ్యానాయక్, హాసలీబాయికి అంకితం చేస్తున్నట్లుగా తెలిపారు.

20 నుంచి 'అనంత చిరుధాన్యాల పండుగ'

◆ చిరుధాన్యాలను ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు ◆ ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు 'అనంత చిరుధాన్యల పండుగ' పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎఎఫ్.ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం నాడు అనంతపురం ఎఎఫ్ ఎకాలజీ కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయనతోపాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాదిగా జిల్లాలో ఆహార పంటల సాగు అధికంగా ఉండేదని తెలిపారు. హరిత విప్లవం నేపథ్యంలో పంటల సాగులో మార్పులు జరుగుతూ వాణిజ్య పంటల వైపు రైతులు మళ్లారని పేర్కొన్నారు. దీంతో అంతకు మునుపు సాగవుతున్న చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగు బాగా తగ్గిపోయిందన్నారు. ఫలితంగా ఇక్కడి ప్రజలు వాడకం కూడా తగ్గిందని చెప్పారు. ఇప్పుడు అంతర్జాతీయంగా చూసుకుంటే మారుతున్న పరిస్థితుల్లో ఆరోగ్యం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని చిరుధాన్యాల వాడకం పెరుగుతోందన్నారు. ఈ క్రమంలో జిల్లాలోనూ చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఏర్పడుతోందన్నారు. దేశంలో కర్నాటక, ఒడిస్సా రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు చిరుధాన్యాలను ప్రజా పంపిణీ వ్యవస్థతోపాటు, ప్రభుత్వ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిరుధాన్యాల ఆహారాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మన రాష్ట్రంలోనూ ప్రభుత్వం మిల్లెట్ మిషన్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. దీన్ని మరింత పకడ్బందీగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. చిరుధాన్యాల వాడకం పెరగడం ద్వారా రైతుకు ఆదాయం... అదే విధంగా ప్రజలకు ఆరోగ్యం లభిస్తాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఎఎఫ్ ఎకాలజీతోపాటు, పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం విభాగాలు అందరరూ కలసి మూడు రోజులపాటు అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో 'అనంత చిరుధాన్యాల పండుగ' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించాలని తలపెట్టినట్టు వివరించారు. 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ దీనిని ప్రారంభిస్తారని తెలిపారు. మూడు రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, స్టాల్స్‌లో చిరుధాన్యాలు, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటలు, ప్రాసెసింగు పద్ధతులు గురించి అందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎఫ్ ఎకాలజీ ప్రతినిధులు మురళీకృష్ణ, లక్ష్మిరెడ్డి, మీడియా కో ఆర్డినేటర్ రమేష్ సుసర్ల, జన జాగృతి ప్రతినిధి బలరాం, స్వచ్ఛకద్యమని ప్రతినిధి వి.విజయ భాస్కర్, తిరుమల ఫుడ్స్ ప్రతినిధి నరసింహులు, సీఆర్డీఎ ప్రతినిధి పి.నరసింహారెడ్డి, ఎపిఎఫ్‌పిఎస్ ప్రతినిధి అలెన్ మాథ్యూ, రెడ్స్ నుంచి వైఎ.అనిత పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైవి.మల్లారెడ్డి

కోడిపందేలు, పేకాట ఆడితే చర్యలు

ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్



ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సంక్రాంతి పండుగ రోజుల్లో సాంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ పేర్కొన్నారు. కోడిపందేలు, పేకాట నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. "జూద క్రీడలు వద్దు... సాంప్రదాయ ఆటలు ముద్దు" అనే విధంగా అందరూ పండుగను జరుపుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. కోడి పందేల జూదరులు, కోడి కత్తులు తయారీదారులు పేకాట, నిర్వహకులపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. కోడి పందేలు, జూదాల వల్ల ప్రజలు సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశ పడి పందేలు కాసే వారు లక్షలాది రూపాయలను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలో కోడి పందేలు నిర్వహించినా, పందేలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు ఆడినా, జూదం ఆడినా సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి లేదా డయల్ 100,112 లేదా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 14500కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.

అందరి సహకారంతో స్నాతకోత్సవం విజయవంతం

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

రెవెన్యూ, పోలీస్, జెఎన్‌టియు బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో 13వ స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించామని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన అన్నారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియు పరిపాలన భవనంలోని ఆర్యబట్టా ఆడిటోరియంలో వర్సిటీ రిజిస్ట్రార్ సి.శశిధర్ అధ్యక్షతన స్నాతకోత్సవం విజయవంత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నాతకోత్సవం విజయవంతంలో ప్రతి ఉద్యోగి సహకారం ఉందన్నారు. అందరి తోడ్పాటుతోనే విజయవంతమైందన్నారు. దాదాపు నెలరోజు నుంచి ప్రత్యేక కమిటీలు వేసి ఎలాంటి సమస్యలు రాకుండా స్నాతకోత్సవం నిర్వహించామన్నారు. రెక్టార్ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ స్నాతకోత్సవం విజయవంతానికి ప్రతి విభాగం, ప్రతి ఉద్యోగి కృషి చేశారన్నారు. ఇందుకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ ఇ.కేశవరెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్లు వి.సుమలత, ఇ.కేశవరెడ్డి, కిరణ్మయి, సి.శోభాబిందు, పద్మ సువర్ణ, ఎ.సురేష్‌బాబు, బి.ఈశ్వర్‌రెడ్డి, ఎన్.విశాలి, పి.సుజాత, వి.చిత్ర, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, విభాగాల అధిపతులు, బోధన సిబ్బంది, కోఆర్డినేటర్లు, అడహక్ సిబ్బంది, బోధనేతర సిబ్బంది, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

రబీ పంట నమోదు చేసుకోండి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరి

ప్రజాశక్తి-గార్లదిన్నె

రైతులు రబీలో సాగు చేసిన పంటలను ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో మండల స్థాయి సలహా మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిడ్ పెన్నార్ రిజర్వాయర్‌లో నీరు తగ్గడంతో పంటలకు నీళ్లు వదలలేక పోయామన్నారు. దీంతో నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోయాయన్నారు. ఈనేపథ్యంలో పంటల దిగుబడి తగ్గిందన్నారు. కావున రైతులు కూడా సహకరించి ఆరు తడి పంటను సాగు చేయాలన్నారు. ఇకపోతే కంది పంట సాగు చేసిన రైతులు పంట దిగుబడిని అమ్ముకునేందుకు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.సోమశేఖర్, ఎఇఒ స్రవంతి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరి

సిఐటియు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-గుంతకల్లు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని సిఐటియు కాలనీలో ఐద్వా మహిళా సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి నర్సింగ్ హోమ్ నిర్వాహకురాలు డాక్టర్ రమ్య ముఖ్య అతిథిగా హాజరై ముగ్గుల పోటీల విజేతలు అంజలి, పార్వతి, పూర్ణిమకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత సంప్రదాయాలకు ముగ్గులు చిహ్నాలు అన్నారు. ఆరోగ్యం పట్ల అందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ, కమిటీ సభ్యులు షాకిరా, సరోజ, కాలనీ కమిటీ సభ్యులు మారుతీప్రసాద్, చంద్రశేఖర్, అబ్దుల్లా, చరణ్, సూరి, రాము, కాలనీవాసులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మహిళా నాయకురాళ్లు

జగన్‌కు గుణపాఠం తప్పదు


టిడిపి సీనియర్ నేత పి.జీవానందరెడ్డి

ప్రజాశక్తి-పామిడి



నిత్యావసర ధరలను ఆకాశానికి ఎగరేసి, సంక్రాంతి కానుక ఎత్తేసి పేదవాడి ఉసురు మూటకట్టుకున్న సిఎం జగన్‌కు త్వరలో గుణపాఠం తప్పదని నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు, పిజెఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు జీవానందరెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. టిడిపి అధికారంలో ఉంటే సంక్రాంతి కానుక ఇచ్చేవారన్నారు. సంక్రాంతి పండుగ రాగానే రేషన్ దుకాణాల ద్వారా ఆరు రకాల సరుకులు బియ్యం, కిలో గోధుమపిండి, కందిపప్పు, శనగపప్పు, బెల్లం, పామోలిన్, నెయ్యితో కలిపి ఒక సంచిని కిట్టుగా అందించారన్నారు. దీంతో తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతిని ప్రజలు ఘనంగా జరుపుకునేవారన్నారు. ఇంటిల్లపాది మూడు రోజుల పాటు సంతోషంగా ఉండే వారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్రాంతి కానుక ఊసే లేదన్నారు. సంక్రాంతి కానుక ఎత్తివేయడంతోపాటు నిత్యావసర ధరలను విపరీతంగా పెంచడంతో పల్లెల్లో ఎక్కడా సంక్రాంతి శోభ కనిపించకుండా పోయిందన్నారు. కావున రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా, పేదలు అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకుని చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు.

గుండెపోటుతో హమాలీ మృతి



బొమ్మనహాల్ : మండలంలోని నేమకల్లు గ్రామానికి చెందిన హమాలీ కురుబ హనుమంతురెడ్డి (30) గుండెపోటుతో మృతిచెందాడు. నేమకల్లుకు చెందిన హనుమంతురెడ్డి బళ్లారికి వెళ్లి హమాలీగా పని చేస్తున్నాడు. ఇందులో భాగంగానే గురువారం బళ్లారికి హమాలీ పనికి వెళ్లాడు. అక్కడ పని చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. దీంతో వెంటనే తోటి ప్రయాణికులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని నేమకల్లుకు తీసుకురావడంతో భార్య కన్నీరు మున్నీరుగా విలపించింది.

ప్రజాశక్తి
www.prajasakti.com

విజిలెన్స్ అధికారుల తనిఖీ

అనంతపురం : అనంతపురం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులతో నగరంలోని కార్ డెకర్స్, కార్ హబ్, కార్‌జోన్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్న వారికి రూ.80వేల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎం.రామారావు, పి.శేషగిరి, ఫణీంద్రానాథ్‌రెడ్డి, జె.వాసుప్రకాష్, శివ ప్రసాద్, యోగేష్‌బాబు, రాజశేఖర్, రవీంద్రనాథ్, కుళ్లాయిరెడ్డి, విజయలక్ష్మి, సిబ్బంది మహమ్మద్ గౌస్, లీగల్ మెట్రాలజీ అధికారులు, పాల్గొన్నారు.



గుత్తిలో ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



బ్రహ్మసముద్రంలో అంగన్వాడీల మౌనదీక్ష

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో వినూత్న రీతిలో నిరసనలు చేపట్టారు. అంగన్‌వాడీలకు ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన 24 గంటల రిలే నిరాహార దీక్షలు 6వ రోజుకు చేరుకున్నాయి. ఒక్కో రోజు ఒక్కొక్క ప్రాజెక్ట్ సంబంధించిన అంగన్‌వాడీ కార్మికులు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారు. గుత్తి ప్రాజెక్ట్ కార్మికులు కోమల, మహాలక్ష్మి, జులియకుమారి, ప్రభావతి, నాగమణి, మహాలక్ష్మమ్మ, వైజయంతి, విజయకుమారి, నాగమ్మ, నాగలక్ష్మి, అలీపీరమ్మ, విజయలక్ష్మిదేవి దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగేంద్రకుమార్, నగర అధ్యక్షురాలు జయ భారతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం గుత్తిలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 32వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు చేస్తూ, ఒంటికాలు మీద నిల్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. వీరికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, రైతుసంఘం నాయకుడు బి.రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సెక్టార్ నాయకురాళ్లు కళ్యాణి, పార్వతి, శారద, బావమ్మ, శోభారాణి, నాగరత్న, గంగ తదితరులు పాల్గొన్నారు.

పామిడి మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలు, అంగన్వాడీల ఇళ్లకు అంటించిన నోటీసులను కాల్చివేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీన, సిఐటియు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రమేష్, రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, అంగన్వాడీలు నారాయణమ్మ, భారతి, జ్యోతి, యశోద, అనిత, షేకున్‌బి, సోఫియా, రజియా, రెహనా, అంగన్వాడీలు పాల్గొన్నారు.



పుట్లూరులో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

బ్రహ్మసముద్రం తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగనవాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా మౌనదీక్ష చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వీరి దీక్షకు చిన్నారులు సంఘీభావం తెలిపి సమ్మె శిబిరంలో కూర్చొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు తిప్పేరమ్మ, వరలక్ష్మి సుజాత, అనిత, వర్కర్లు సుజాత, సంతోషమ్మ, త్రివేణి, ఎర్రమ్మ, సత్యమ్మ సంతోష, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పుట్లూరు మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జయలలిత, శశికళ, రమాదేవి, అనంతలక్ష్మి, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 32వ రోజు శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కార్యదర్శి మేరీ మాట్లాడుతూ స్వయానా సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని తాము సమ్మె చేస్తుంటే పరిష్కరించాల్సింది పోయి నోటీసులు జారీ చేయడం బాధాకరమన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. అధికారులతో భయపెట్టి సమ్మెను విరమించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ నాయకులు రాధిక, మెహ్రూన్, రుద్రమ్మ, మల్లమ్మ, చంద్రకళ, అంగన్వాడీలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండల కేంద్రాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. వీరికి సిపిఎం, సిపిఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సమ్మె చేస్తే సమస్యలు పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్లు మధుసూదన్, విరూపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, రంగమ్మ, శ్వేతనాగు, సరోజమ్మ, బ్యులా, ధనలక్ష్మి, జ్యోతి, రామంజినమ్మ, లోకమ్మ, నాగమణి, శివశ్రీ, సువర్ణమ్మ, శశికళ, లక్ష్మీదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.




పామిడిలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యసేవలు

ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయమని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గడేకల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచి సుశీలా ఉమాశంకర్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్య సురక్షను తీసుకొచ్చారన్నారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా గడేకల్ గ్రామ సచివాలయం-1 పరిధిలో 378 మంది వివిధ రకాల పరీక్షలు చేసినట్లు తెలిపారు. వీరిలో ఇద్దరిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, డాక్టర్లు శ్రీకాంత్, రాజేష్, శైలజ, పంచాయతీ కార్యదర్శి సోమయ్య, ఆరోగ్య సిబ్బంది కిషోర్, తిరుపాల్‌నాయక్, సుగుణ, శివరామకృష్ణ, ఫర్జాహాన్, వైసిపి నాయకులు ఉమాశంకర్ మాధవరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు ఉన్నారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి


పెద్దపప్పూరు : మండలం పరిధిలోని ముచ్చుకోట గ్రామంలో శుక్రవారం రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రామకృష్ణ మాట్లాడుతూ పేదలందరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, వైసిపి మండల కన్వీనర్ అమర్నాథరెడ్డి, సూపర్‌వైజర్ షర్మస్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల సంరక్షణ అందరి బాధ్యత

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

సంప్రదాయాల సంరక్షణ అందరి బాధ్యత అని జనసేన జిల్లా అధ్యక్షులు టీసీ వరుణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణపురం పంచాయతీలోని ఎఎస్‌ఆర్ మెయిన్ సర్కిల్‌లో 'మన ఊరు.. మన ఆట'పేరుతో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఎస్‌ఆర్ మెయిన్ సర్కిల్ ప్రాంగణమంతా రంగవల్లులతో నిండిపోయింది. మహిళలు, యువతులు పోటీపడి ముగ్గులు వేశారు. ముస్లిం యువతులు సైతం ముగ్గులు వేస్తూ రంగులు నింపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. న్యాయ నిర్ణేతలుగా జనసేన రాయలసీమ ప్రాంతీయ మహిళా కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, వీరమహిళలు జక్కిరెడ్డి పద్మావతి, సువర్ణ, సావిత్రమ్మ, దాసరి సరిత, శ్రీవాణి వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పొదిలి బాబురావు, సాకే పవన్‌కుమార్, మురళీకృష్ణ, జయరామ్‌రెడ్డి, అంకే ఈశ్వరయ్య, పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, రాపా ధనంజయ్, సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, సిద్ధు, జయమ్మ, అవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు గ్రంధి దివాకర్, జక్కిరెడ్డి ఆదినారాయణ, చక్రపాణి, హుస్సేన్, కుమ్మర మురళి, అంజి, సంపత్, వడ్డే వెంకటేష్, సంతోష్‌కుమార్, వీరమహిళలు సావిత్రి, అనసూయ, అనిత, అంజలి, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్



వైద్యులకు నేత్రాలు అందజేస్తున్న దృశ్యం

నేత్రదానం

అనంతపురం : నగరంలోని నాయక్‌నగర్‌కు చెందిన ఆవుల ధనలక్ష్మి మృతిచెందడంతో భర్త ఆవుల పరమేష్, కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. ధనలక్ష్మి మృతిచెందిన విషయం తెలుసుకున్న సాయి ట్రస్టు సభ్యులు మృతురాలి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి ఎల్‌వి.ప్రసాద్ ఆసుపత్రికి చెందిన ఆప్తమాలిక్ అసిస్టెంట్ నాగరాజు ఆధ్వర్యంలో నేత్రాలు సేకరించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

టిడిపి విజయం ఖాయం

సీనియర్ నాయకులు ఆలం నరసానాయుడు

ప్రజాశక్తి-నార్పల

'రా కదలిరా' బహిరంగ సభలతో రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆలం నరసానాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. రా కదలిరా కార్యక్రమం ద్వారా టిడిపి అధినేత చంద్రబాబు రాష్ట్రంలో కొనసాగుతున్న పాలన వల్ల ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను వివరిస్తున్నారన్నారు. అంతేగాకుండా చంద్రబాబు సభలకు ప్రజలు స్వచ్ఛంగా వస్తున్నారన్నారు. దీనికితోడు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మద్దతు పూర్తిగా కలిసి వస్తుందన్నారు. జిల్లాలో అన్ని సీట్లు గెలవబోతున్నామన్నారు. రాష్ట్రంలో వైసిపి పాలన వచ్చాక పాలన పూర్తిగా కుంటుపడిందన్నారు. దోచుకోవడమే పనిగా నాయకులు పని చేస్తున్నారు తప్ప ప్రజా సమస్యలపై ఏనాడూ పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ఇసుక, గ్రానైట్, మైనింగ్ పేరుతో రూ.లక్షల కోట్లు దోచుకున్నారన్నారు. ఇకపోతే భూహక్కు చట్టం అమలైతే రైతులపై యజమానులు పూర్తిగా హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో ప్రజలు, యువత టీడీపీ-జనసేన జెండా పట్టుకుని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పిటిసి హనుమంతు సూచించారు. శుక్రవారం విడపనకల్ మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పిటిసి మాట్లాడుతూ త్వరలో మండలంలో కందులు, జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కందులు క్వింటాకు రూ.9వేలు, జొన్నలు క్వింటాకు రూ.3,225 మద్దతు ధర ఉండవచ్చని వివరించారు. ప్రతి రైతు రబీ సీజన్‌లో వేసిన పంటలకు తప్పకుండా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య మాట్లాడుతూ పీఎం కిసాన్ రానివాళ్ల బ్యాంకు అకౌంట్‌కు, ఆధార్ నెంబర్‌తో లింక్ చేసుకోవాలన్నారు. అలాగే ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, వ్యవసాయ సిబ్బంది, వైసిపి నాయకులు గిరిబాబు, ఎంఎల్‌ఒ కుళ్లాయిస్వామి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ హనుమంతు

బలిజలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

రాయలసీమ బలిజ మహాసంఘం నేతలు

ప్రజాశక్తి-అనంతపురం

రానున్న ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు బలిజలకు తగినన్ని సీట్లు కేటాయించి రాజకీయ ప్రాధాన్యత కల్పించకపోతే తమ సత్తా చూపిస్తామని రాయలసీమ బలిజ మహాసంఘం నేతలు హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న రాయలసీమ బలిజ మహా సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అనంతపురం, రాయదుర్గం, హిందూపురం, పుట్టపర్తి నియోజకవర్గాల్లో బలిజలు అధికంగా ఉన్నారన్నారు. కావున రెండు అసెంబ్లీ, ఒక ఎంపి స్థానం కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వాలు బలిజలను బిసి జాబితాలో చేర్చే అంశంపై పునరాలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బలిజ మహా సంఘం జిల్లా అధ్యక్షులు టి.శంకరయ్య, గౌరవాధ్యక్షులు బళ్లారి వెంకటరాముడు, కాయగూరల లక్ష్మీప్రసాద్, విజయబాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రాయలసీమ బలిజ మహాసంఘం నేతలు

భవిష్యత్తుకు 'చంద్రన్న' గ్యారెంటీ

పామిడి : రాష్ట్ర భవిష్యత్తుకు టిడిపి అధినేత చంద్రబాబు గ్యారెంటీ అని అనంతపురం పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు అన్నారు. శుక్రవారం మండలంలోని రామగిరి ఎగువ తండాలో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం వైఫల్యాలను వివరించారు. అంతేగాకుండా టిడిపి అధికరంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కిషోర్, గోవింద నాయక్, పార్థసారథి, ప్రతాప్, తిరుపాలు, రామాంజి, శీన, నల్లప్ప, మునీంద్ర, చాగంటి గోవిందరాజులు, రామయ్య, నారాయణ, కదిరప్ప, మనోహర్, ఉమానాయక్, రాధా, జానకి, అరుణ, తెలుగుదేశం, జనసేన, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రం అందజేస్తున్న అనంతపురం పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు హిమబిందు

కోడిపందేలు ఆడితే చర్యలు : ఎస్ఐ

ఆత్మకూరు : సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎవరైనా కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కె.జనార్ధన్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని తోపుదుర్తి, రంగంపేట, సనప గ్రామాల్లో ఎస్ఐ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జీవనం కొనసాగించాలన్నారు. ఎవరూ ఎలాంటి గొడవలు జోలికీ వెళ్లకూడదన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే గ్రామాల్లో నాటుసారా చేయడం నేరమన్నారు.

అనాథలు, వృద్ధులకు అల్పాహారం

గుత్తి : పట్టణంలోని కొత్తూరులో ఉన్న స్వీట్ సేవియర్ చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన వృద్ధ, అనాథాశ్రమాల్లో శుక్రవారం అల్పాహారం అందజేశారు. సినీ నటుడు మహేష్ బాబు సినిమా గుంటూరు కారం విడుదల సందర్భంగా స్థానిక బీసీ కాలనీలోని శ్రీసాయి టిఫిన్ సెంటర్ యజమాని, మహేష్‌బాబు అభిమాని లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు మహేష్‌బాబు అభిమానులు మార్తాడు దాదా ఖలందర్, మహబూబ్‌బాషా, కందుల చంద్ర, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన

నార్పల : మండల కేంద్రంలోని క్రాసింగ్‌లో ఉన్న జగనన్న కాలనీని తహశీల్దార్ హరికుమార్‌తోపాటు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వం ఖాళీగా ఉంచిన స్థలాన్ని కొందరు కబ్జా చేసుకుని అమ్మకాలు కొనసాగిస్తున్నారని వార్తలు రావడంతో స్పందించిన అధికారులు కాలనీని సందర్శించి లబ్ధిదారులతో ఆరాతీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఎక్కడా ఆక్రమణలు జరగలేదన్నారు. భవిష్యత్తులో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడినా, ప్రభుత్వ స్థలాలను క్రయవిక్రయాలు చేసినా శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహులు, వీఆర్వోలు, హెడ్ కానిస్టేబుల్ చలపతి పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబానికి విధేయులం : మాజీ ఎమ్మెల్యే



అనంతపురం : వైఎస్ కుటుంబానికి తమ కుటుంబం విధేయులమని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయ్యేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయన తనకు ఏ బాధ్యత అప్పగించినా ముందుండి నెరవేరుస్తానన్నారు. అంతేగానీ పార్టీ మారుతున్నట్లు వస్తున్న దుష్ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఎవరూ అలాంటి అవాస్తవాలను నమ్మవద్దన్నారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ తనని ఆహ్వానించినా వెళ్లే ప్రసక్తే లేదన్నారు. వైఎస్ కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన కాంగ్రెస్ పార్టీని వీడే రోజే.. అప్పట్లో మంత్రి పదవి ఇస్తామని అవకాశం ఇచ్చినా లొంగలేదన్నారు. వైఎస్ కుటుంబంతో ఉన్న అనుబంధం తమకు అలాంటిది అన్నారు. ఎమ్మెల్యే టికెట్ విషయంలో సీఎం జగన్ నిర్ణయమే తన నిర్ణయమన్నారు.

పంచాయతీ నిధుల మళ్లింపు మానుకోవాలి

శింగనమల : గ్రామాల అభివృద్ధికి కేంద్రం ఇటీవల విడుదల చేసిన రూ.988 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించాలని ప్రయత్నించడం బాధాకరమని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి, గుమ్మేపల్లి సర్పంచి దేగల లలితమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. తాజాగా దొంగిలించిన రూ.600 కోట్లను నాలుగు రోజుల్లోగా గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తు, జిల్లా పరిషత్‌ల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు.

భయపడకండి..అండగా ఉంటాం..

టిడిపి నేతలు జెసి ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు : 'భయపడకండి.. అండగా ఉంటాం' అంటూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి ప్రధాన వీధుల్లో ర్యాలీగా షాదీఖానాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత చంద్రబాబు తీసుకుంటారన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రజా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును గెలిపిస్తేనే రాష్ట్ర భవిష్యత్తు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, జెసి అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

బ్రహ్మసముద్రం : ప్రతి అక్షరం ప్రజల కోసం శ్రమిస్తూ.. అక్షరమే ఆయుధంగా మలచి అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ప్రజాశక్తి దినపత్రిక సేవలు ఎనలేనివని తహశీల్దార్ వాణిశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రజాశక్తి రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల సమస్యల కోసం రాస్తూ ప్రజలను చైతన్యవంతులుగా చేసి ముందుకు వెళ్తున్న ప్రజాశక్తి దినపత్రికను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దాసానాయక్, మండల విద్యాధికారి ఓబులపతి, ఉపాధ్యాయులు హనుమన్న, ఐఇఆర్‌డి కోఆర్డినేటర్ అరుణ, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనాథ్, ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వోలు నాగేంద్ర, లక్ష్మన్న రాఘవేంద్ర, రాజగోపాల్, మరిస్వామి, ఐసిడిఎస్ కో ఆర్డినేటర్లు రామాంజనమ్మ, కాసిందబీ, అంగన్వాడీ యూనియన్ మండల యూనియన్ నాయకురాలు తిప్పేరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎంపిఇఒకు సన్మానం

ఉరవకొండ : ఉత్తమ ఎంపిఇఒగా ఎన్నికైన రామ్మూర్తిని పలువురు ప్రజాప్రతినిధులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందించిన వారిని గుర్తించి జిల్లాకు ఒకరికి చొప్పున అవార్డును అందించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న రామ్మూర్తి ఎన్నికైనందుకు అభినందిస్తూ పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాకెట్ల ఆమిదాల గ్రామాల సర్పంచులు దయ్యాల నాగరాజు, శ్రీరాములు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జీవితం ఆదర్శనీయం



లైబ్రరీలో వివేకానందకు నివాళులర్పిస్తున్న
జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమా మోహన్‌రెడ్డి, అధికారులు

జయంతి సభల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గొప్ప సంఘ సంస్కర్థ, శాంతి ధర్మ బోదన కర్త స్వామి వివేకానంద 160 జయంతి వేడుకలు నగరంలో ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో వివేకానంద చిత్ర పటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమా మోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమా పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఇంతియాజ్ అహమ్మద్, రవికుమార్ నాయుడు, ప్రతాప్ రెడ్డి, వీరరాయణరెడ్డి, మల్లి కార్జున, కావేరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.వివేకానంద చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శశాంక మౌళి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జయలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్లు బాలాజీ నాయక్, సోమశేఖర్, విష్ణుప్రియ, శ్రీనివాసులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమణ, పల్లవి, లక్ష్మీకాంతం, రంగనాథ్, రామకష్ణ, అనంతరెడ్డి, తదితర అధ్యాపక బందం హాజరై పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అశోక్ నగర్‌లో వివేకానంద పార్కులో వివేకానంద యోగ కేంద్ర అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథులుగా మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోగటం విజయ్ భాస్కర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుదు సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్మణ్, హెూమియో డాక్టర్ కుమారయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి గురుస్వామి హాజరై వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అనంతపురం కార్పొరేషన్ : భారతదేశ ఖ్యాతిని ప్రపంచదేశాలకు చాటిచెప్పిన ఘనత వివేకానందుడికే దక్కుతుందని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 'పేదలకు సేవ చేస్తే భగవంతుని సేవ చేసినట్లు' అని స్వామి వివేకానంద చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఈ కార్యక్రమములో అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ వాసంతి కార్పొరేటర్లు చంద్రమోహన్‌రెడ్డి, సైఫుల్లా, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఇఇ సూర్యనారాయణ, సుధామణి, డిఇ ద్రాక్షాయణి, ఆర్‌ఐలు వేణుగోపాల్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని ఎస్‌ఎస్‌బిఎన్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్ జాతీయ యూత్‌డేను ఘనంగా నిర్వహించారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువత చేసిన విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు వందన, నిఖిత, భావన, అఖిల, భార్గవ, జ్యోతిర్మయి, రేణుక, అల్లావుద్దీన్, జగదీష్, వంశీ, వర్ధన్, అంకిత, అంజలి, శ్రీవల్లి, అనూష, అర్షియా, మాబ్జాన్, దీపిక, పూజిత, అంజలి, రాజ్యలక్ష్మి, మేఘన, కళాశాల ల్యాబ్ అసిస్టెంట్ లోకేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సరస్వతీ విద్యా మందిరం ఉన్నత పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు కొండాపురం సునీల్‌రెడ్డి స్వామి మాట్లాడుతూ ఉన్నత కుటుంబంలో జన్మించిన స్వామి వివేకానంద సన్యాసులు, యోగుల పట్ల అమితమైన ప్రేమను కనబరిచేవారన్నారు. వారు ఏది అడిగినా లేదనుకుండా ఇచ్చేవారన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సరస్వతి విద్యా మందిరం ప్రాథమిక, ఉన్నత పాఠశాల కమిటీ సభ్యులు, ప్రధాన ఆచార్యులు శ్రీనివాసులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి : జాతీయ యువజన దినోత్సవం గుత్తిలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని పెన్షనర్ల భవన్‌లో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షులు కె.అబుబకర్, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుల్లాయి బాబు, కోశాధికారి ఫక్రుద్దీన్, నాయకులు షేక్షావలి, లక్ష్మీనారాయణరెడ్డి, శ్యాముల్, గోవిందప్ప, నారాయణరెడ్డి, నాగేశం, చెన్నారెడ్డి, నారాయణశెట్టి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఎస్‌బిఎన్‌లోనిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్త



పామిడిలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



గుత్తిలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

భూపట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-పామిడి

గుంతకల్లులోని ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి క్యాంపు కార్యాలయంలో పామిడి మండలానికి చెందిన లబ్ధిదారులకు శుక్రవారం భూములకు సంబంధించిన పట్టాలు పంపిణీ చేశారు. పామిడి మండలానికి చెందిన ఏడు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 118 పట్టాలను ఎమ్మెల్యేతోపాటు గుంతకల్లు మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నైరుతీరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సునీతాబాయి, రెవెన్యూ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



భూ పట్టా అందజేస్తున్న
గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, తదితరులు

కొత్త పింఛన్లు అందజేత

ఉరవకొండ : మండల పరిధిలోని కడదరబెంచి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా మంజూరు చేసిన వివిధ రకాల పెన్షన్లను సర్పంచి దేవరాజ్ శుక్రవారం పంపిణీ చేశారు. ముందుగా సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్ర'



క్రీడాకరులతో ఎంపిడిఒ నిర్మలాకుమారి

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా రాచేపల్లి, శింగనమల జట్లు తలపడగా శింగనమల జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్టు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఎంపిడిఒ నిర్మలాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, పీటీ బైపరెడ్డి, అసిస్టెంట్ నాగేంద్ర, బాలకృష్ణ, అధికారుల పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ రామకృష్ణ పర్యవేక్షణలో సెబ్ ప్రత్యేక బృందం భారీగా కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుంది. వివరాల మేరకు.. సెబ్ ప్రత్యేక బృందం సీఐ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తెల్లవారుజామున కుందుర్పి మండలం మహంతపురం శివార్లలో దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా కర్నాటక రాష్ట్రం లింగదహాల్ మద్యం దుకాణం నుంచి కుందుర్పి మండలం మందలపల్లికి టాటా సుప్రో వాహనంలో తరలిస్తున్న రూ.2.95 లక్షల విలువజేసే 6,912 టెట్రా పాకెట్లు (72 బాక్సులు) స్వాధీనం చేసుకున్నారు. మహంతపురం ఓబుళేసును అరెస్టు చేసి కీలక నిందితుని కోసం గాలిస్తున్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని చాలివేముల గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి నుంచి మద్యం స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో శివశంకర్‌రెడ్డి మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి నిందితుడితోపాటు 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గుత్తి : మండలంలోని ఊటకల్లు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన గొల్ల శేషన్న అనే వ్యక్తి అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తుండగా ఎస్సై బి.నబి రసూల్ నిందితున్ని అరెస్టు చేసి అతని వద్ద ఉన్న15 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మాణిక్యం, హెడ్ కానిస్టేబుళ్లు హనుమంతు, ప్రకాశం, కానిస్టేబుల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పుట్లూరులో పట్టుబడిన మద్యం వివరాలను వెల్లడిస్తున్న
ఎస్‌ఐ దిలీప్‌కుమార్



గుత్తిలో నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ నబిరసూల్